# అభిమానం

మంగళ కొంచెం పొడుగ్గా వుంటుంది. అందమయిన మొహం. మొహంలో నున్నటి నిగారింపు. తళతళ మెరిసే కళ్లు. ఆ కళ్ళలో కాంతి నక్షత్రాలు. ఎప్పుడూ ఎందువల్లనో తడిగా వుండి కాంతులీనే పెదవులు. ఒకసారి చూసిన వాళ్లు తిరిగి మరోసారి తప్పకుండా చూస్తారు. ఆశ్చర్యం యేమిటంటే డిగ్రీ సెకండియర్‌లో ఆమె క్లాసులో వున్న మగవాళ్లు, మంగళ వుంటున్న వీధిలోనే నివాసం వుంటున్న ఆమె వయసు మగపిల్లలు ఆమె ప్రేమకోసం, పొందుకోసం తపించిపోతున్నట్లు ప్రేమ లేఖలు రాసినా ఆమె స్పందించలేదు. ఒక్కడి గురించీ ఆలోచించలేదు.

కానీ మంగళ స్నేహితురాలు అచల అటువంటి మనిషి కాదు. రోడ్డుమీద ఎదురయిన ఏ మగాడు సూటిగా కళ్లలోకి చూసినా చలించిపోయి వాడు కనుమరుగయ్యేవరకూ వెనక్కి తిరిగి చూస్తూనే వుంటుంది. అచల కూడా మంగళతో చదువుతోంది.

ఆరోజు సాయంత్రం అయిదు గంటలు దాటుతున్న సమయంలో మంగళ తన స్నేహితురాలు అచల ఇంటికి వచ్చింది. అలా వస్తున్నప్పుడు ఆరోడ్డు కార్నర్‌లో వున్న పాన్‌షాపు దగ్గర నిల్చుని వున్న చంద్రమోహన్‌ని చూసింది. అతను సిగరెట్లు కొనటానికి

అక్కడ నిల్చున్నాడనీ, తర్వాత ఆనందరావు ఇంటికి వస్తాడనీ అనుకుని నవ్వుకున్నది.

ఆనందరావు ఎవరో కాదు. అచలకు అన్నయ్య- అతను- చంద్రమోహన్ ఒకే కాలేజ్‌లో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నారు. చంద్రమోహన్ మంగళ కంటే కొంచెం పొడవుగా, లావుగా వుంటాడు. ఇద్దరూ పక్కపక్కనే నడుస్తున్నప్పుడు జోడీ బావుంటుందని ఎవరయినా అనుకుంటారు.

చంద్రమోహన్ చూట్టానికి చాలా మామూలుగా వుంటాడు. చాలా నిర్లక్ష్యంగా వున్నట్టు కనపడతాడు. కానీ బాగా చదువుతాడు. మంచి మార్కులు తెచ్చుకుంటాడు. ఎప్పుడు చదువుతాడో తెలీదు కానీ ఎప్పుడూ సిగరెట్లు కాలుస్తూ రోడ్డు మీద తిరుగుతూ వుంటాడు. అతనొక రచయిత. కథలూ, నవల్లూ రాస్తూ వుంటాడు. అతడిని చూసిన వాళ్లెవరూ అతనొక రచయిత అని అనుకోరు. సినిమా థియేటర్ దగ్గర బ్లాక్‌లో టిక్కెట్లు అమ్మేవాడిలా వుంటాడు.

అలా వుండే చంద్రమోహన్- అచల ఇంట్లోకి వచ్చేసరికి మంగళ స్నేహితురాలితో అతని గురించే చెబుతోంది. అతను వచ్చి వరండాలో వున్న కుర్చీలో కూర్చున్నాడు. తర్వాత రెండు నిముషాలకు ఆనందరావు వచ్చాడు. పక్కనే వున్న గదిలోకి వెళ్లారు అచల- మంగళ.

చంద్రమోహన్ పెట్టెలోనించి సిగరెట్టు తీసి వెలిగించాడు. పెట్టెలో ఇంకా ఒకే ఒక్క సిగరెట్టు వుంది... దాన్ని ఎదురుగా వున్న టీపాయ్ మీద వుంచాడు.

ఆనందరావు ఇంకో రెండు రోజుల్లో వచ్చే ఆదివారం నాడు కార్తీకమాసం సందర్భంగా దగ్గరలోనే వున్న జాగర్లమూడి వెళ్లి అక్కడి అరటితోటలో భోజనాలు చేసే కార్యక్రమం గురించి చంద్రమోహన్‌తో మాట్లాడుతున్నాడు.

"ఇంకా ఎవరు వస్తున్నారు?" అడిగాడు చంద్రమోహన్.

"మనిద్దరం, రామస్వామి. ఆంజనేయులు"

"ఇంతేనా? అమ్మాయిలెవరూ రావడం లేదా?" అడిగాడు చంద్రమోహన్.

"నాకెవరూ తెలీదు... నువ్వు పిలుచుకురా..." అన్నాడు ఆనందరావు.

ఒక్కసారిగా నవ్వింది మంగళ పక్క గదిలో నించి...

"నవ్వడం ఎందుకో?...." అన్నాడు చంద్రమోహన్.

"లేకపోతే వనభోజనాలకు అమ్మాయిలు ఎందుకో...అమ్మాయిలు పక్కన లేకపోతే గొంతుకు ఏదయినా అడ్డుపడుతుందా?" అనడిగింది మంగళ నవ్వుతూ.

"అవును! థాంక్స్... బాగా గ్రహించావు...నువ్వొస్తానంటే నాకు అభ్యంతరం లేదు" అన్నాడు చంద్రమోహన్ నిలబడి...

"వెళుతున్నావా?" అడిగాడు ఆనందరావు.

"అవును! పనుంది.. కథ రాయాలి" చెప్పాడు చంద్రమోహన్.

"ఏం కథ?" లోపల్నుంచి అడిగింది మంగళ.

"ప్రేమించటం చేతకాని ఓ అమ్మాయి కథ" అన్నాడు చంద్రమోహన్. అలా అని బయటకు వెళ్ళిపోయాడు. అలా వెళుతున్నప్పుడు వెదురుతో అల్లిన ఆ టీపాయ్ మీద వుంచిన సిగరెట్టు పెట్టెను మరచిపోయాడు. అతను వెళ్లగానే ఆనందరావు తన గదిలోకి వెళ్లిపోయాడు. ఆపైన ఐదు నిముషాలకు మంగళ కూడ ఇంటికి వెళ్లిపోయాంది...అచల ఒక్కతే టీపాయ్ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుని వుంది...

అప్పుడు చంద్రమోహన్ వచ్చి తను టీపాయ్‌మీద మరచిపోయిన సిగరెట్టు పెట్టి గురించి అడిగాడు.

కానీ అది అక్కడలేదు.

"ఇక్కడలేదు" అని చెప్పింది అచల.

చంద్రమోహన్ కూడా చూశాడు కానీ టీపాయ్ మీద సిగరెట్టుపెట్టి కనిపించలేదు.

దిక్కుతోచనట్లు దిక్కులు చూసాడు చంద్రమోహన్. అలా చూసి వెళ్లిపోయాడు.

◆ ◆ ◆

ఆదివారం.... సాయంత్రం ఆరు గంటలు దాటి చాలా సేపయ్యింది. కార్తీక మాసం కావటంవల్ల అప్పటికే చీకట్లు కమ్ముకుంటున్నాయి.

రైలుస్టేషన్లో బెంచీమీద కూర్చున్నారు చంద్రమోహన్- ఆనందరావు...

కొంచెం దూరంలో స్టేషన్ వరండా మెట్లమీద అచల-మంగళ, మరో ఇద్దరు అమ్మాయిలు కూర్చొని కబుర్లు చెప్పు కుంటున్నారు. వనభోజనాలు చెయ్యటానికి వాళ్ల కూడా వచ్చారు.

ఇంకా గుంటూరు వెళ్లే రైలు రాలేదు.

అప్పుడే రైలు రాకను సూచిస్తున్నట్లు గంట కొట్టారు.

చంద్రమోహన్ లేచివెళ్ళి కుళాయి దగ్గరకు వెళ్లి దాన్ని నొక్కి మంచినీళ్లు తాగాడు. అతను తిరిగి రాబోతున్నప్పుడు గబగబా మంగళ వచ్చి "ప్లీజ్... బాగా దాహంగా ఉంది... కుళాయిని నొక్కుతారా? కాసిని నీళ్లు తాగుతాను' అన్నది అర్థింపుగా...

సరేనన్నాడు చంద్రమోహన్..

కుళాయి బటన్ నొక్కాడు... చేతిలో వున్న చిన్న హేండ్‌బేగ్‌ను కుళాయి గట్టు మీద పెట్టి నీళ్లుతాగి థాంక్స్ కూడా చెప్పకుండా వెళ్లిపోయింది మంగళ.

అప్పుడు చంద్రమోహన్ ఏదో వాసన రాగా మంగళ మరచిపోయిన హాండు బ్యాగ్‌ను తెరిచి అందులో చెయ్యి పెట్టాడు. చేతికి దొరికిన దాన్ని బయటకు తీసి చూశాడు. అతడి ఆశ్చర్యానికి అంతు లేదు.

అది- అతడు ఆరోజు సాయంత్రం ఆనందరావు ఇంట్లో టీపాయ్ మీద మరచిపోయిన సిగరెట్టు పెట్టె.

తను మరిచిపోయిన సిగరెట్టు పెట్టెను ఎవరూ చూడకుండా తీసి తన హ్యాండు బేగులో భద్రంగా దాచుకున్నది.

ఎందుకు?

ఇలా ఆలోచించగానే అలా ఎందుకు దాచుకున్నదో... అతడికి చటుక్కున స్ఫురించింది. వెంటనే అతడి గుండెలో ఎవరో గంటలు మోగించినట్లు, అదేపనిగా నవ్వినట్టూ అనిపించింది. చంద్రమోహన్ పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

వెంటనే మళ్లీ ఆ పెట్టెను బ్యాగ్‌లో వుంచి జిప్ లాగుతున్నప్పుడు మంగళ వచ్చి "నా బేగ్" అన్నది.

దాన్ని అతడు ఆమెకిచ్చాడు.

అప్పుడే వేగంగా వచ్చిన రైలు ఆగిపోయింది.

జనం ఎగబడ్డారు.

బేగ్‌ను భుజానికి తగిలించుకుని రైలు ఎక్కటానికి పరుగుతీసింది మంగళ... ఆనందరావును రమ్మని మంగళ వెనుకే పరుగుతీశాడు చంద్రమోహన్.

రైలుపెట్టె ఎంట్రెన్స్‌కు రెండు వైపులా వున్న కడ్డీలను పట్టుకుని రైల్లోకి ఎక్కుతోంది మంగళ. సరిగ్గా మంగళకు వెనుకనే వున్నాడు చంద్రమోహన్.

మంగళ ఆఖరిమెట్టుమీద నుంచి రైల్లోకి కాలుపెట్టబోతున్నప్పుడు చంద్రమోహన్ ముందుకు వంగి నున్నగా వున్న మంగళ మెడమీద సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు.

అప్పుడు-ఆక్షణంలో మంగళ చిన్నగా థాంక్స్ చెప్పటం చంద్రమోహన్ ఒక్కడికే వినిపించింది.

అభిమానాన్ని రంగరించిన అంతులేని అనుభూతి....

*(మల్లెతీగ మాసపత్రిక మార్చి 2008)*